## 2

# నీటిని ఆపివేసిందెవరు?

## (1 రాజులు 17:1-15)

మీరు మీ యింటివద్ద నీళ్ళను ఆపివేయటం చూచారా? బహుశ నీరు వచ్చే మార్గం ఎక్కడో తెగిపోయి యుండవచ్చు. లేదా నీటి గొట్టాలను రిపేర్ చేసేపనివారు నీటిధారను ఆపివేసి పని చేస్తూ యుండవచ్చు. బహుశ నీరు గడ్డకట్టుకొనిపోయి యుండవచ్చు. ఇదంతా కాదు. ఒకవేళ మీ సతీమణిగారు నీటిబిల్లు చెల్లించకపోయి కూడ ఉండవచ్చు!

ఇలాంటి విషయాలు మీకు సంభవించియుండలేదా బహుశ అత్యవసర స్థితిలో ఆ నీరు ఆగిపోయిన సందర్భాలు కూడా ఉండియుండవచ్చు. బహుశ నీవు గడ్డం చేసుకునేటప్పుడు, సగంలో నీరు ఆగిపోయియుండవచ్చు. లేదా తలస్నానం చేస్తుంటే బాగా తలకు నురుగు పట్టించిన తర్వాత ఆగిపోయియుండవచ్చు, లేదా బాగా ఒంటినిండ సబ్బు రాసుకొని అభ్యంగ స్నానం చేసే సందర్భంలో ఆగిపోయియుండవచ్చు!

ఇలాంటి పరిస్థితులు సంభవించినప్పుడు మీలో రెండు ప్రశ్నలు తలెత్తుతాయి: (1) "అసలు ఎవరండీ నీటిని ఆపివేసినవారు?" (2) అయినా *"ఎందుకంటా?"*

1 రాజులు 17:1-15 సందర్భంలో "ఎందుకు?" అనే ప్రశ్న ముఖ్యంగా వేసుకోవాలి. బహుశ ఈ ప్రశ్నకు జవాబు కోసం వెతకడం చాలా కష్టం. "ప్రభువా యిలా ఎందుకు జరుగవలసివచ్చింది?" "ప్రభువా నా తలిదండ్రులు (లేదా నా బిడ్డ లేదా స్నేహితుడు) ఎందుకు మరణించాల్సి వచ్చింది?" "ప్రభువా, నేను ఎంతో నమ్మకంగా నీ సేవ చేస్తున్నానే, అలాంటపుడు యింత భయంకరమైన విషయం నాకు జరగవలసి వచ్చింది?" ఎందుకు, ఎందుకు, అయ్యో ఎందుకూ?

ఈ "ఎందుకు" అనే ప్రశ్నతో మనం తలమునకలైనప్పుడూ కలత చెందునప్పుడు యెషయా 55:8, 9 మనం గుర్తుంచుకోవాలి:

> నా తలంపులు మీ తలంపులవంటివి కావు మీ త్రోవలు నా త్రోవలవంటివి కావు ఇదే యెహోవా వాక్కు. ఆకాశములు భూమికి పైన ఎంత యెత్తుగా ఉన్నావో మీ మార్గములకంటె నా మార్గములు మీ తలంపులకంటె నా తలంపులు అంత యెత్తుగా ఉన్నవి.

దేవుని మార్గాలు మన మార్గములవంటివి కావు. అది మనం తెలుసుకోవలసిన ప్రముఖమైన సత్యం.

ఈ సత్యాన్ని ఎక్కడో దూరంగా ఉంచుకొని ఆలోచించినా, మనకు మనం ఆపాదించుకొనకుండ ఎవరో యితరులకు ఆపాదిస్తూ ఎంతో ఆలోచించినా మనకేం అర్థంకాదు. ఉదాహరణకు మనం ఏదైనా సిద్ధాంతపరమైన విషయాలు మాట్లాడుతున్నప్పుడో ఏవరైనా "ఆ విషయం నాకేమంత ముఖ్యంగా అనిపించడంలేదు" అంటారు, మనం వెంటనే,

“చూడండీ దేవుని మార్గాలు మన మార్గాలలాంటివి కావు” అని చెబుతాం. ఎవరైనా అన్యుడైన నీ స్నేహితుడు జీవితంలో ఏంటి యీ గందరగోళం ఏది సరిగా ఉండదు అంటూ వేసే ప్రశ్నకు: “దేవుని మార్గాలు మన మార్గాల్లాంటివి కాదు గదా” అంటూ నిర్లక్ష్యంగా జవాబిస్తావు.

ఏదైతేనేం, మన జీవితాల్లో మనం అనుకున్నంతగా మన ప్రణాళికా ప్రకారం జరగకున్నా, మన విశ్వాసానికి పరీక్ష సమయం వచ్చినప్పుడు, మనం అంతా మంచే చేస్తున్నాం కాని అంతా తప్పుడు త్రోవకే మళ్ళుతుంది, మనకు ప్రియమైనవారు ఎవరో ఒకరు చనిపోయినట్లయితే “ఎందుకు?” అనే ప్రశ్న మనం వేసినప్పుడూ, వాళ్ళువీళ్ళు యిచ్చే సంజాయిషీకి మనకేలాంటి ఆదరణ దొరకదు, అంటే వారేం పలుకలేదంటే, “దీనికి కారణం మాకేమి దొరకడం లేదు. దేవుని మార్గాలు మన మార్గాలవంటివి కావు. ఏమి బాధపడవద్దు అంతా మన మంచికే జరుగుతుంది అని జవాబిస్తారు.” కాబట్టి ఏదైనా సూక్ష్మంగా గమనించినా సత్యాన్ని మాత్రం గ్రహించ లేకపోతున్నాం.

ఈ కొద్ది పఠనా విభాగంలోనే ఈ సమస్యకు పరిష్కారం చూపించలేం గాని, 1 రాజులు 17:1–15 వాక్యభాగం మనందరం నేర్చుకోవలసిన ఒక పాఠంగా ఉంటుంది. ఈ నీటిని ఆపివేసిందెవరు – ఎందుచేత?

## ఇశ్రాయేలులో నీటిని దేవుడు ఎందుకు ఆపివేశాడు (17:1)

1 రాజులు 17:1 మొదటి భాగంలోనే, మనం ఒక ప్రశ్న వేసుకోవాలి: “ఇశ్రాయేలులో దేవుడు నీటిని ఎందుకు ఆపివేశాడు?”

ఈ ప్రశ్నకు జవాబు కోసం మనం ఒక్కసారి ఇశ్రాయేలులో ఏమి జరిగిందో పరిశీలించాలి. ద్వితీయోపదేశకాండము 7:1–6లో మోషే దేవుని ప్రజలను హెచ్చరిక చేశాడు:

> నీవు స్వాధీనపరచుకొనబోవు దేశములోనికి నీ దేవుడైన యెహోవా నిన్ను చేర్చి బహు జనములను, … నీ యెదుటనుండి వెళ్ళ గొట్టిన తరువాత, నీ దేవుడైన యెహోవా వారిని నీకప్పగించునప్పుడు నీవు వారిని హతము చేయవలెను, వారిని నిర్మూలము చేయవలెను, వారితో నిబంధన చేసికొనకూడదు, వారిని కరుణింపకూడదు, *నీవు వారితో వియ్యమందకూడదు, వాని కుమారునికి నీ కుమార్తె నియ్యకూడదు. నీ కుమారునికి వాని కుమార్తెను పుచ్చుకొనకూడదు. నన్ను అనుసరింపకుండ ఇతర దేవతలను పూజించునట్లు నీ కుమారుని వారు మళ్లించుదురు; అందును బట్టి యెహోవా కోపాగ్ని నీమీద రగులుకొని ఆయన నిన్ను త్వరగా నశింపజేయును. …*
>
> నీవు నీ దేవుడైన యెహోవాకు ప్రతిష్ఠిత జనము, నీ దేవుడైన యెహోవా భూమిమీదనున్న సమస్త జనములకంటె నిన్ను ఎక్కువగా ఎంచి, నిన్ను తనకు స్వకీయ జనముగా ఏర్పరచుకొనెను. (నొక్కి చెప్పింది నాది.)

అయినప్పటికి, ఇశ్రాయేలీయులు ఈ హెచ్చరికను పెడచెవిని బెట్టారు. అహాబు సింహాసనం మీద కూర్చునియున్నాడు యెజెబెలు అతని పక్కనే ఉన్నది. ఆమె ఎలాంటిది, బయలు పూజను ఇశ్రాయేలులో ప్రవేశపెట్టిన ఫేనీకేయ రాణి. యెహోవా బలిపీఠాలను కూలద్రోసి ఆయన ప్రవక్తలను చంపించిన స్త్రీ, ఇశ్రాయేలులో గొప్ప ఆత్మీయ సంక్షోభం చెలరేగిన సమయమది.

మనం యిలా అంటాం, “ప్రభువా నీవేం చేస్తావు? పరలోకంనుండి అగ్నిని రప్పించి ఈ

ఇశ్రాయేలు ప్రజలను ఒక్కసారి దహించలేవా?"

దేవుడంటాడు, "ఇప్పుడే కాదు."

"మరి గొప్ప సైన్యం దిగివచ్చి ఈ దేశాన్ని ఒక్కసారి నేలమట్టం చేసెయ్యకూడదా?"

"ఇప్పుడే కాదు."

"నమ్మకమైన బోధకులు, ప్రవక్తలు, యాజకుల సమూహం ఒక్క పట్టునవచ్చి ఈ బయలు పూజలను అరికట్టవచ్చుగదా?

"ఇప్పుడే కాదు."

"సంస్కారవంతుడైన ఒక గొప్ప అధినేత వచ్చి రాజు యొక్క ప్రేమానురాగాలను గౌరవాన్ని చూరగొని అతన్ని నీ యొద్దకు నడిపించవచ్చు గదా?"

"కాదు" దేవుడంటాడు, "నా వ్యక్తి ఏలీయా మాత్రమే."

"ఏలీయా? అతని గురించి నేనెప్పుడూ వినలేదే! అతనెవరు సరే కొంచెం చూడనివ్వండి. అరె అడిగో ఆ అడవి మనిషిలా కనబడుతున్నాడు? అతను మాత్రం కాదు గదా. ఈ మధ్య అతను బొత్తిగా గడ్డం చేసుకున్నట్టుగాని తలకత్తిరించుకున్నట్టుగాని లేదు. బహుశ స్నానం సంస్కారాలుకూడ యీ మధ్య అసలు చేసినట్టులేదు. ఇక అతని మాటలు సంభాషణ చూస్తే అసలు అతను విద్యావంతుడో, ఆ స్వరం కీచురాళ్ళ స్వరంలా చెవ్వులు చిల్లు పడుతున్నాయి. మరి ఇలాంటివాడెందుకు ప్రభువా. అసలెందుకు ప్రభువా?"

దేవుడు జవాబిస్తున్నాడు, "నా తలంపులు మీ తలంపులలాంటివి కాదు. నా మార్గములు మీ మార్గములవంటివి కాదు. ఇశ్రాయేలులో నా మనిషి అన్నవాడు *యితడే.*"

ఈ దృశ్యఘట్టం మనం చదువుతున్న పాఠాన్ని ఎంతో అర్థవంతంగా చేస్తుంది. ఇశ్రాయేలులో ఉన్న ఆత్మీయ సమస్యను దేవుడే పరిష్కరిస్తాడు, కాని అది ఆయన విధానంలో, ఆయన సమయంలో, ఆయన ప్రణాళికా ప్రకారం మాత్రమే చేస్తారు.

ఇంతకు ముందు మనం ఎక్కడ ఆపివేశామో అది యిప్పుడు ప్రారంభిద్దాం. ఏలీయా అహాబుకు ఎదురుగా వచ్చాడు. అహాబుతో ఏలీయా ఇలా అన్నాడు: "ఎవని సన్నిధిని నేను నిలువబడియున్నానో, ఇశ్రాయేలు దేవుడైన ఆ యెహోవా జీవముతోడు నా మాటప్రకారము గాక, యీ సంవత్సరములలో మంచైనను వర్షమైనను పడదని ప్రకటించెను" (1 రాజులు 17:1).

రోజులకొద్దీ నీరు లేనట్లయితే ఎంత అసౌకర్యం కలుగుతుందో మనకు తెలుసు. ఇక యిలా వారాలు గడిస్తే యిక అదెంత నరకయాతనో మనకు ఇంకా బాగా తెలిసిందే, ఇక నెలలు గడిస్తే అది కరువు కాలంగా పరిగణించాల్సిందే. తర్వాత సంవత్సరాలుగా అంటే మానవులంతా మట్టిపాలు కావలసిందే. ఇక భూమి మీద ప్రాణం ప్రాణులు లేనట్టే. ఔను యిక్కడ, "సంవత్సరాలు" గడవడం చూస్తున్నాం. *కరువు మూడున్నర సంవత్సరములు* కొనసాగింది అని క్రొత్త నిబంధనలో రెండుచోట్ల వ్రాయబడివుంది (లూకా 4:25; యాకోబు 5:17).

కరువు రావాలి అని దేవుడెందుకు ఆజ్ఞలు జారీచేశాడు? దీనికి మనం జవాబు చెప్పడానికి బైబిల్లోని మొదటి పుటల్లో కెళ్ళి ద్వితీయోపదేశకాండము 7వ అధ్యాయాన్ని తెరచి చూద్దాం. దేవుడు విగ్రహారాధనకు వెళ్ళనే వద్దని పెద్ద హెచ్చరిక చేయడం చూస్తున్నాము. ఇక తర్వాత హెచ్చరిక యింకా అదే పుస్తకంలో కొంచెం ముందుకెళ్ళి 11వ అధ్యాయంలో చూచినట్టయితే:

> మీ హృదయము మాయలలో చిక్కి త్రోవవిడిచి ఇతర దేవతలను పూజించి వాటికి నమస్కరింపకుండ మీరు జాగ్రత్తపడుడి. లేనియెడల యెహోవా మీమీద కోపపడి *ఆకాశమును మూసివేయును; అప్పుడు వాన కురియదు, భూమిపండదు.* యెహోవా మీకిచ్చుచున్న ఆ మంచి దేశమున ఉండకుండ మీరు శీఘ్రముగా నశించెదరు (ద్వితీయోపదేశకాండము 11:16, 17; నొక్కి చెప్పింది నాది).

అసలుసిసలైన నిగూఢమైన సత్యమేమంటే మనుష్యులు వారి వారి క్రియలమూలంగా తరచుగా ఎంతో శ్రమపొందువారుగా ఉంటారు. "అరేయ్ అది నీవు చేతులారా చేసుకున్నావురా" అంటూ అందరము అనడం సహజంగ వింటుంటాం. అంతే కాదు మన సమస్యలకు ఎప్పుడూ అవతలవాళ్ళను నిందించడమెందుకు చెప్పండి.

ఇక బైబిల్లో చివరిభాగాల వైపువెళదాం; మరో ముక్క చిక్కునకు సరిపోవుదాని దగ్గరకు వెళ్ళుదాం. యాకోబు ఈ కథకు యింకా కొంత వాస్తవాన్ని చేర్చడం మనం చూస్తున్నాం, బహుశ బైబిల్లో దీన్ని యింకెక్కడా చూడలేదు: "ఏలీయా మనవంటి స్వభావముగల మనుష్యుడే; *వర్షింపకుండునట్లు అతడు ఆసక్తితో ప్రార్థన చేయగా* మూడున్నర సంవత్సరముల వరకు భూమిమీద వర్షింపలేదు" (యాకోబు 5:17; నొక్కి చెప్పింది నాది).

ద్వితీయోపదేశకాండము 11:16, 17ల్లో మనం చూచినట్లయితే. ప్రార్థనా ఫలితంగా కరవు వాటిల్లినది. అంటే దేవుడు ఏది చేస్తానని భయపెట్టినాడో అది చేయడానికి కూడ ప్రార్థనే కారణమయింది. ప్రార్థన అనేది ఎంత శక్తివంతమైనదో గ్రహించగలం. ప్రార్థనకు గల శక్తి ఎంతో గ్రహించడానికి ఈ ఉదాహరణ గొప్పగా నిరూపిస్తుంది. ఒక దేశం యొక్క ఆర్థిక వ్యవస్థ ఈ మూడున్నర సంవత్సరాల్లో అతలాకుతలం అయింది!

సరే మరలా మన ప్రశ్నకు తిరిగి వద్దాం. ఇశ్రాయేలులో నీరు లేకుండ పూర్తిగా ఆపివేసినావేంటి దేవా అని మనం దేవుని ప్రశ్నించగల్గినట్లయితే, ఆయనేమంటాడంటే, (1) "ప్రజలు నా స్వరానికి అవిధేయత చూపించారు, వాళ్ళు శిక్షార్హులు"; (2) "నాయందు నమ్మిక గల నా సేవకుడూ ఏలీయా ప్రార్థించాడు కాబట్టి, విశ్వాస సహితమైన ప్రార్థన గొప్ప లాభసాధకమైనది కాబట్టి"; లేదా (3) "నేనే దేవుడనని ప్రజలకు కనబరచుకోడానికి, మరియు వారి త్రోవలు ఎంత వంకరగా ఉన్నాయో ప్రజలకు కనబరచి తద్వారా వారు పశ్చాత్తాపపడి నావైపుకు మరలునట్లు చేయడానికి" అని అనవచ్చు!

దేవుని మార్గాలను నీవూ నేను అర్థం చేసుకోలేము, ఇక వాటిగురించి యోచించడం మనలను ఆశ్చర్యాలతో ముంచెత్తుతుంది. దీన్ని బాగా తలంచండి: దేవుడు ఆ దేశం యొక్క గమనాన్ని తనవైపుకు మళ్ళించడానికోసం మూడున్నర సంవత్సరాలు వర్షం ఆపివేయడం కంటే ఏ గొప్ప విషయం చేయగలడు?

## కెరీతు వాగులో నీరు లేకుండ దేవుడు చేశాడెందుకు? (17:2-7)

మనం కెరీతులోని రెండవ భాగానికొద్దాం (17:2–7), "కెరీతు వాగు నీరెండి పోవునట్లు దేవుడు చేశాడెందుకు?"

"పిమ్మట యెహోవా వాక్కు అతనికి ప్రత్యక్షమై" అని చదువగలం (వచనం 2). ఒకదాని తర్వాత ఒకటి చేయవలసిందిగా దేవుడు ఏలీయాను కోరినాడు. అహాబు ఎదురుగా నిలిచి దేవుని సందేశాన్ని తెల్పినప్పుడు, దాని తర్వాత ఏంచేయాలో అతనికి తెలియదు. "పిమ్మట

యెహోవా వాక్కు ప్రత్యక్షమై." అతను కెరీతు వాగునొద్దకు వెళ్ళి బహుశ ఒక సంవత్సరము కంటే ఎక్కువ కాలం ఉండి యుండవచ్చు. అటు పిమ్మట ప్రభువు వాక్కు అతనికి విన బడింది (వచనం 8). అప్పుడు అతడు సారెపతుకి వెళ్ళినాడు. మూడున్నర సంవత్సరముల తర్వాత మనం మరలా యిలా చదువుతాం, "... అనేక దినములైన తర్వాత యెహోవా వాక్కు, ఏలీయాకు ప్రత్యక్షమైనది" (1 రాజులు 18:1).

నేను దీని మీద నా వాదాన్ని కట్టుకోవడం లేదు, మీరు అంతేకదా? నేను ప్రణాళిక వేయాలనుకుంటున్నాను. అనుకున్న పనులన్ని ఒకేసారి జరుగుతాయని మనం ఊహించుకో కూడదు, కాని ఏదైనా ఒక దాని తర్వాత ఒకటి జరుగుతాయి అంతే.

ఏలీయా దేవుని మనిషి కాబట్టి జరుగబోయేదేమిటో అతనికి ముందుగానే తెలియవలసిన అవసరం లేదు. ఒక అడుగు తర్వాత ఒకటి ముందుకు వేస్తున్నాడు. ("ప్రభువు యిదే రీతిగా నేనువుండాలని నీవు కోరినట్లయితే, యిక నాకేం ఫరవాలేదు.")

రెండవ వచనానికి తిరిగి వస్తున్నామంటే రెండవ అడుగులో ప్రవేశించినట్లే.

రెండవ అడుగు అంటే మీ ఉద్దేశమేమిటి? నీవు ఏలీయా పరిస్థితిలో ఉన్నట్లు భావించుకో. ఇక్కడ రాజుకు ప్రకటన చేసియున్నాడు. అయితే ఏంటి? జాతీయ దూరదర్శన్‌లో, ఒక ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టాము అనుకోండి. పెద్ద ప్రకటనతో ఒక పెద్ద ప్రచార ప్రకటనను చేయించండి. ప్రతి ఒక్క వార్తా పత్రికలో, మేగజైనుల్లో ప్రకటనలు గుద్దించండి. లేదా బి.సి.లో సమానమైన విధానం: ఇక వీధులగుండా, గ్రామలగుండా వెళుతూ ప్రకటించడమా? (దాదాపు యోనా నినెవెలో చేసిందే ఇతనూ చేశాడు. వీధులవెంట యోనా పరుగులిడుతూ: "మారు మనస్సు పొందండి!" అంటూ ఎలా కేకలేస్తూ ప్రకటించాడో) ఇది చాలా అర్థవంతంగా ఉంటుంది సుమా. దేవుడు, "నా త్రోవలు మీ త్రోవలూవంటివి కావు" అంటున్నాడు.

రెండవ అడుగు ఏది? ఇక్కడ 3 మరియు 4 వచనాలను గమనించు:

> నీవు ఇచ్చటనుండి తూర్పువైపునకు పోయి యొర్దానునకు ఎదురుగానున్న కెరీతు వాగుదగ్గర దాగియుండుము. ఆ వాగు నీరు నీవు త్రాగుదువు, అచ్చటికి నీకు ఆహారము తెచ్చునట్లు నేను కాకోలములకు ఆజ్ఞాపించితినని అతనికి తెలియ జేయగా.[1]

ఒకవేళ నేనే గనుక ఏలీయానయ్యున్నట్లయితే దేవుడు నాతో అన్న మాటలకు నేను ఎలా జవాబిచ్చేవాడినో, దేవుడు యిలా అన్నట్టయితే, "నీవు కొంచెం ప్రక్కకు తొలగవయ్యా పరిస్థితులు కొంచెం మారేవరకు, నేను నిన్ను కొంతకాలం దాచిపెట్టుంచుతాను."

అప్పుడు నేనంటాను, "అయ్యో ఎక్కడ దాచిపెడతావు? ఇంట్లోనా? ఏదైనా గుడారంలోనా? ఎక్కడ?"

"నా మనసులోనైతే ఒక *వాగు దగ్గర.*"

"ఒక వాగా? ... బహుశ నేను వెళ్ళి కాస్త దాన్ని బాగుచేసుకోవాలనుకుంటా."

"నీవు త్రాగవలసింది ఆ వాగు నీరే."

"సరే మీరలా అనడం బాగానే ఉంది. మరి భోజనానికి యింకా వేరే దగ్గరకు వెళ్ళాలా?"

"అబ్బే లేదు, నీకు ఆహారం వడ్డించేవారిని ఏర్పాటు చేస్తా."

"ఆహారం వండినవాళ్ళా? ఏదేమన్నా హైయాట్ హిల్‌టనా లేక సమరయా?"[2]

"అబ్బే ఏమికాదు. కాకులు. *ఈ కాకులు* ఉదయం సాయంత్రం వచ్చి నీకు రొట్టె మాంసం తీసుకొనివస్తాయి."

"కా ... కులా? ఛీ ... ఛీ ఆ రోత కాకులా? మోషే ధర్మశాస్త్ర ప్రకారం ఈ కాకులు అపవిత్రమైనవి అంటారు కదా? అలాంటి కాకులు వాటి రోత ముక్కులతో మురికి కాళ్ళతో నాకు ఆహారం చేరవేయడమా?"

"ఔను మరి!" అంటాడు దేవుడు.

ఇశ్రాయేలులో ఉన్న మన మనిషి అయితే మనం అలా ట్రీట్ చేస్తామా? బహుశ చేయమేమో – కాని దేవుని త్రోవలు మన త్రోవలవంటివి కావు.

ఇశ్రాయేలులో ఉన్న దైవజనునికి కావలసిన క్షేమం కావలసిన అక్కరలు, సదుపాయాలు అందరు చేసినట్లే దేవుడు చేశాడు. కాని మనిషి ఆలోచించిన విధానంలో ఆయన చేయలేదు సుమా! నీవు గనుక నమ్మకమైన దేవుని బిడ్డవై యున్నట్లయితే దేవుడు నీకు కావలసిన సంక్షేమ వసతి ఆహార సౌకర్యాలు తప్పక చేస్తాడు. అన్ని ఆశీర్వాదాలు సమకూరుస్తాడు. కాకపోతే అవన్ని ఆ మురికి వాగులాంటి దానినుండి మరియు ఆ పాడు కాకుల్లాంటివాటినుండి కూడ.

5వ వచనంలోని మొదటి బాగాన్ని చూద్దాం: "అతడు పోయి యెహోవా సెలవుచొప్పున చేశాడు." అది చూడ్డానికి అందంగా లేదా? దేవుడు మాట్లాడినప్పుడు, ఏలీయా ఆయన చెప్పింది చేశాడు. ఈ రోజు లోకమంతా నేర్చుకొనవలసిన పాఠం అదే! దేవుడు మాట్లాడినప్పుడు ఆయన బోధించేదే అసలైంది ఆఖరైంది. అది నాకు అర్థమైనా అర్థం కాకపోయినా అది మాత్రం చాలా ప్రాముఖ్యమైంది. ఎందుచేతనంటే అది దేవుడు చెప్పింది కాబట్టి అది నాకు ఎంతో మంచిది; దాన్నే నేను చేస్తాను!

> అతడు పోయి యెహోవా సెలవు చొప్పున యొర్దానునకు ఎదురుగానున్న కెరీతు వాగు దగ్గర నివాసము చేసెను. అక్కడ కాకోలములు ఉదయమందు రొట్టెను మాంసమును అస్తమయమందు రొట్టెను మాంసమును అతనియొద్దకు తీసికొనివచ్చుచుండెను; అతడు వాగు నీరు త్రాగుచు వచ్చెను (5, 6 వచనాలు).

ఈ కెరీతు వాగు ఎక్కడయున్నదో మాకు తెలియదు. అది "యొర్దానునకు తూర్పు గావున్నది"[3] అని వ్రాయబడియున్నది. ఏలీయా ఇక్కడ పెరిగి పెద్దవాడయ్యాడంటాడు.

ఒక్కసారి ఆ ప్రాంతాన్ని ప్రదేశాన్ని నీవు మనస్సులో ఉంచుకొని చూడు. అది ఒక కొండ సందుల లోయ, దాంట్లో ఒక వాగు పారుతున్నట్లు మనకు చాలా దూరంగా కనిపిస్తుంది. ఆ వాగుకు యిరువైపుల కొంత పచ్చిక చిన్నచిన్న గుబ్బురులు, పొదలు తుప్పలు, చిన్న చెట్టు చేమలు ఉండియుండవచ్చు. ఇక వాగునకిరువైపుల ఒడ్డుమీద ఆయన జంతువుల కదలికవల్ల వాటి కాలి ముద్రలు కనిపించుచుండవచ్చు.

ఇక్కడ వాక్యభాగమేమని చెబుతుందంటే ఏలీయా వెళ్ళి ఆ వాగు ఒడ్డున జీవించాడు అని. అక్కడ చాలా కాలంగా బస చేశాడు, అనేక నెలలుగా అది అతని నివాసం, ఇల్లు.

ఇక్కడ "కెరీతు" అనే మాటకు "తెగిపోయినది" అని అర్థం లేదా "వేరు చేయబడినది" అని అర్థం. వాస్తవానికి జరిగింది కూడ అదే ఏలీయా లోకానికి దూరంగా వెళ్ళిపోయాడు అందరినుండి వేరై ఒంటరిగా అజ్ఞాతంలో అనేక నెలలుగా దూరంగా వెళ్ళి పోయాడు.

ఎండనుండి, చలినుండి, ఆకురాలు కాలం, ఎముకలు కొరికి వేసే చలినుండి ఆహ్లాదం కలిగించే వసతులనుండి దూరంగా వెళ్ళిపోయాడు. ఇరు ప్రక్కల ఉండే బండలు, గుట్టలు అతనికి భద్రతను కలిగించే గోడలు, క్రింది పచ్చిక అతని పరుపు, ఆకాశం అతని యింటి పైకప్పు. యిక అతని ముతక అంగీ అతను కప్పుకునే గొంగళిలాంటిది.

ఏలీయా అక్కడ ఎంతకాలం నివాసం చేశాడో తెలియదు. దాదాపు మూడున్నర సంవత్సరాలు మాత్రం దాగివుండి యున్నాడు. 1 రాజులు 18:1లో అతడు సారెపతులో రెండు సంవత్సరాలు కంటె ఎక్కువ కాలం ఉన్నట్టున్నాడు. అలాంటప్పుడు, కెరీతు నొద్ద ఒక సంవత్సరం కంటె ఎక్కువకాలమే ఉండి యుంటాడు.

కొంచెం ఆగి ఆ విషయం ఆలోచించండి. అతను బాగా హుషారైన పనివాడే గాని ఒక్క సంవత్సరం పాటు ఖాళీగా ఉండవలసి వచ్చింది. అదెంత కష్టమైన విషయమో మీకు తెలియదా? ఇది మనకెంతో కష్టమైన విషయం. మనం కొన్ని సార్లు ఒకటి రెండు సంవత్సరాలైనా పనిలేకుండవుంటే బాగుండు అనుకుంటాం కాని కొన్ని రోజులు పనినుండి దూరమయ్యామనుకోండి ఎంతో బోరుకొడుతుంది. ఏమి తోచడం లేదు, ఉద్యోగానికి వెళ్ళిపోతే బాగుండునే అనుకుంటాం. మనం అనుకంటాం ఒకటి రెండు నెలలు పడకలో విశ్రాంతి తీసుకుంటే బాగుంటుందనుకుంటాం కాని ఏదైనా అనారోగ్యంవల్ల కొన్ని రోజులు మాత్రం పడకలో ఉన్నట్లయితే ఎప్పుడు త్వరగాలేస్తామా అన్నట్లు కోరుకుంటాం. మనం ఎప్పుడూ, “పనిచేస్తూ”నే ఉండాలనుకుంటాం; గాని బలవంతంగా మనమీద పని రుద్దితే ఒప్పుకోం. కొన్నిసార్లు మన అనారోగ్యంవల్ల, ఏదో విరమణవల్ల లేదా మన ఉద్యోగ మార్పిడి వల్ల. ఈ పరిస్థితులన్ని కష్టతరమైనవే కాని దేవుని త్రోవలు మన త్రోవలవంటివి కావు. దైవ సంబంధమైన ఏర్పాట్లు మన ఏర్పాటులవంటివి కావు. దేవుని కార్యక్రమాలు మన కార్యక్రమాలాంటివి కావు.

అనేక సార్లు మన జీవితాల్లో మనం కూడ ఈ వాగు దగ్గర జీవించే జీవితానికి రావాలి లోకాన్నుండి లౌకికబంధకాలు తెగతెంపులు చేసుకొని మన పనులన్ని పక్కకి పెట్టివేసి ఈ వాగు అనుభవంలోకి రావాలి సుమా. అది అంత సుళువైన విషయం కాదు; కాని అది దేవుని చిత్తం మరియు మన మేలుకే. ఈ విషయాన్ని మనం యిష్టపూర్వకంగా అంగీకరించాం. మనం కూడ విరామం తీసుకొనడం నేర్చుకోవాలి. అలాంటి అనుభవాల ద్వారా ఎంతో నేర్చుకోవాలి.

ఆ కెరీతు దగ్గర గడిపిన ఆ నెలల సమయ అనుభవం ద్వారా నేను తెలుసుకోవాలను కొంటున్నాను. అతడు దేవుని ప్రార్థిస్తూ, ద్యానిస్తూ ఆ దినాలలో, వారాలలో, నెలలో గడిపి నందున ఏలీయా ఎంతగానో ఆత్మీయంగా ఎదిగినాడని నా ఊహ, బైబిలు ఈ వివరాన్ని చెప్పడం లేదు. ఇది ఏమని ఖచ్చితంగా చెబుతుందంటే, “ఏలీయా యెహోవా సన్నిధిలో నిలుచుండెను” అని (1 వచనం) మరియు దేవుడేమని చెప్పియున్నాడో అది చేశాడు (5 వచనం).

ఇప్పుడు కథలో అతి ముఖ్యమైన వింతైన ఘట్టానికి వస్తున్నాము. ఇక్కడ ఏలీయా దేవుడు చెప్పింది చేయడం, ఏ స్థలంలో దేవుడు చెప్పమన్నది చెప్పడం తూచా తప్పకుండ చేశాడు ... *ఇక వెంటనే వర్షం ఆగిపోయింది*: “కొంతకాలమైన తర్వత దేశములో వర్షము లేక ఆ నీరు ఎండిపోయెను” (వచనం 7).

ఈ విషయం మీరు తిలకిస్తున్నారా? ఈ వాగు అప్పటికప్పుడే ఎండి పోలేదు. కొన్ని రోజులు లేక కొన్ని వారాలు పట్టి యుండవచ్చు. ఒక రోజు ఏలీయా ఆ వాగులో నీరు త్రాగుతుంటే ఏదో పొరపాటు జరిగినట్టు గమనించాడు కాని అసలు అదేదో అతనికి అర్థం కాలేదు. మరుసటిరోజు, "బహుశ నా వూహ అయివుంటుంది. కాని ఈ వాగు బాగా లోతైనది కాదు, యిదివరకు పారినంతగా నీళ్ళుపారడం లేదు" అనుకొని యుంటాడు. మరుసటి రోజు అసలు విషయం తేటతెల్లమైయింది, "అది వూహ *కాదు.* మాయ మంత్రమూ కాదు, వాగు బాగా ఎండిపోయింది!"

ఏలీయా రోజు తర్వాత రోజు "వాగు రోజు రోజుకు ఎండి పోవడం, నీరు బురద నీరుగా మురికిగా మారడం గమనిస్తున్నాడు. రోజు అక్కడికి వచ్చే చిన్న పక్షులు, జంతువులు, క్రిమికీటకాలు రావడం మానివేశాయి. ఆ చేప పిల్లలుకూడ చెంగుచెంగున ఆ బురద నీటిలో ఎగురుతూ అంతరించి పోయాయి. నీరు గుంట ఎండి నేల బీటలు బారడం జరుగుతుంది.

ఇదంతా జరుగుతుంటే చూస్తూ చూస్తున్నాడేగాని ఏమీయూ చేయలేక ఉన్నాడు. ఆ విషయం మీ మనస్సుల్లో బాగా నాటుకోనివ్వండి. వాగు పూర్తిగా ఎండిపోయే వరకు మూడవ ఘట్టం గురించి బయలుపరచలేదు. ఇక 8వ వచనం చూడండి: "అంతట యెహోవా వాక్కు అతనికి ప్రత్యక్షమైనది."

ఆహా యిదెంత విశ్వాస పరీక్ష. ఏలీయా యొక్క మొట్టమొదటి పరీక్ష, "ఒంటరిగా నిలబడడం" అదెంతో కష్టమైన విషయం. రెండవ పరీక్ష ఏమంటే "ఎలాంటి ఎదురు ప్రశ్న వేయకుండ విధేయుడవడం, అంటే తనకు చెప్పినదాంట్లో ఎలాంటి అర్థం వాస్తవం లేకపోయినా విధేయుడవడం." అది ఎంతో కష్టతరమైంది. ఇక మూడో విషయం చూద్దాం. అబ్బో అన్నిటి కంటె యిది మహా కష్టతరమైంది: కాని అతను దేవుడు తనను ఎక్కడ ఉండమని కోరినాడో అతడు ఉన్నాడు. దేవుడు చేయమన్నది తప్పనిసరిగా చేశాడు. తనకెదురుగా ఉన్న ఆ వాగు పూర్తిగా ఎండిపోయింది కూడ!

బహుశ అలాంటి చోటుకు నీవు వెళ్ళినావా. ఔను మీరువెళ్ళినారు. గతంలో మీకు బ్యాంక్‌లో బాగా అకౌంటు ఉంది – తర్వాత ఈ వాగులా అంతా తుడిచి పెట్టుకుపోయింది. గతంలో నీకు మంచి బిజినెస్ ఉండేవి – కాని యిప్పుడది పూర్తిగా పడిపోయింది. గతంలో ఒక సారి నీకు ఎంతో మంచి ఆరోగ్యం ఉంది, మంచి దృఢమైన శరీరం ఉండేది, బాగా ఆలోచించగల మనస్సు ఉండేది – కాని, అవన్ని ఈ వాగులా అంతరించి పోయాయి. గతంలో ఒకేసారి నీ కెన్నో వరాలు కలిగి ఉండేవి అవన్నీ దేవుని సేవకు వాడుతూ ఎంతో చురుగ్గా ఆయన సేవ చేశావు. కాని ఆ వాగులా నీవు ఎండిపోయిన స్థితికి చేరుకున్నావు. నా వివాహం ఎంతో గొప్పగా జరిగింది అనుకొన్నాను – చివరకు ఆ వాగులా విఫలమై పోయింది. నీవు నీ పిల్లలను పెంచి పైకి తీసుకొచ్చావు. దేవుని భయంతో పెంచావు ఎంతో మంచి పని చేశాను కదా అనుకున్నావు. అయితే విఫలమై పోయింది – ఆ వాగులా ఎండిపోయినట్టయింది.

ఏలీయా యిదంతా చేయలేదు, కాని "ఓ ప్రభువా ఈ కెరీతు నీళ్ళు ఎండి పోజేశావేంటి, ఎందుకు?" అంటూ అతను అరచినట్లు ఊహించుకుందాం. ప్రభువు యొక్క మొదటి జవాబు ఆశ్చర్యంగా దూసుకొని వచ్చింది: "ఓ ఏలీయా, నీవు ప్రార్థన చేశావు కాబట్టి నేను చేశాను." వాక్యమేమని చెబుతుంది చూద్దాం: "*వర్షంలేనందున ఆ వాగు ఎండిపోయెను*" ఆ దేశంలో వర్షం ఎందుకు లేకుండ పోయింది? ఏలీయా ప్రార్థన చేశాడు కాబట్టి (యాకోబు 5:17).

అన్ని సార్లు కాకపోయినా కొన్ని సార్లయినా కొన్ని విషయాలు మనం వూహించని రీతిగా పరిణమిస్తాయి. ఎందుకంటె దేవుడు మన ప్రార్థన ఆలకించాడు కాబట్టి. "దేవా నాకు ఓర్పు అనుగ్రహించు, కాని దీర్ఘకాలం తీసుకోకు." లేదా: "దేవా నాకు విశ్వాసం అనుగ్రహించు, కాని నేను బైబిలు చదువకుండ మాత్రం చేయుము" లేదా: "నాకు బలము ప్రసాదించు, కాని బాధపడకుండ చేయుము." ఎప్పుడూ మనం అనుకున్నట్లు పరిస్థితులు జరగవు. దేవుని మార్గాలు మన మార్గాలకంటె విభిన్నంగా ఉంటాయి.

ఏదెలావున్నా, ఏలీయా ప్రార్థనకు దేవుని జవాబేమిటంటే: "నీరు ఆగిపోవడం అనేది తర్వాత ప్రణాళికంతటిలో తర్వాత మెట్టు కాబట్టి ఏమి చింతించవద్దు; నన్ను నమ్ము, అన్ని సవ్యంగా జరుగుతాయి ఏం పరవాలేదు."

## సారెపతులో నీరులేకుండ దేవుడెందుకు చేశాడు (17:8-16)

మన వాక్యభాగంలో మూడవ ఘట్టానికి వస్తున్నాము (1 రాజులు 17:8–16) అందుకు మనం అంటున్నది ఏమనగా, "సారెపతులో దేవుడు నీరు లేకుండ ఎందుకు చేశాడని?"

> అంతట యెహోవా వాక్కు అతనికి ప్రత్యక్షమై యిలాగు సెలవిచ్చెను – నీవు సీదోను పట్టణ సంబంధమైన సారెపతు అను ఊరికి పోయి అచ్చట ఉండుము; నిన్ను పోషించుటకు అచ్చటనున్న యొక విధవరాలికి నేను సెలవిచ్చితిని (8, 9 వచనాలు).

ఇక్కడ నేను ప్రభువుతో ఒక వ్యూహాత్మక సంభాషణ అల్లడానికి ప్రయత్నించడంలేదు. అలాకాకుండ నీవు ఒక ఏలీయావు అనుకో, ఇక రాజుతో నీవేలా సంభాషించగలగాలో అన్నట్లు ఆ విధానంలో ఒక సంభాషణ రూపుదిద్దుకో. ఈ క్రింది వివరించబడిన కొన్ని వాస్తవాలను మనస్కరిద్దాం:

(1) దేవుడు ఏలీయాను తిరిగి రాజు దగ్గరకు పంపించలేదు లేదా పోయి ప్రకటించమని చెప్పలేదు. ఆయన ఏలీయాను స్థానికంగా ఉండకుండ వేరే చోటునకు పంపించాడు. (2) తూర్పు దిక్కుకు వెళ్ళమని దేవుడతని కోరలేదు, ఈ కరవు కోరలనుండి దూరంగా తీసుకొని పోలేదు. దానికి మారుగా డెబ్బై అయిదు లేక వందమైళ్ళకు పైగా ఈశాన్యంగా వెళ్ళవలసిందిగా కోరినాడు. అదంతా కరవుకు కటకటలాడిన ప్రదేశం. (3) ఉత్తర తీర ఇశ్రాయేలులోని ఫేనీకే పట్టణం, సముద్రతీర ప్రాంతంలోయున్న సారెపతు అనే కుగ్రామానికి వెళ్ళవలసిందిగా దేవుడతనికి చెప్పాడు. యెజెబెలు ఈ ప్రాంతానికి చెందినదే! (4) ఒక పెద్ద సౌభాగ్యవంతుని ఆనంద గృహంలో బసచేయమని ఏలీయాతో దేవుడు చెప్పలేదు. కాని ఒక బీద విధవరాలి గృహంలో అతనికి వసతి ఏర్పాట్లు చేశాడు.

ఈ వాస్తవాలన్నింటిని కూడగట్టుకొని నీవు ఆలోచిస్తే, "ఎందుకు?" అని నీవు పెద్దగా కేకలేస్తావు. దానికి తిరిగి వచ్చే ప్రతిధ్వని ఏమనగా: "నా త్రోవలు మీ త్రోవలు వంటివి కాదు!" అని.

ఈ క్రొత్త ఉత్తరువులకు ఏలీయా ఎలా స్పందించాడు? అతని మనసులో ఎలాంటి ప్రశ్నలు చెలరేగినా అతను మాత్రం దేవుడు చెప్పింది చేశాడు: "అతడు లేచి సారెపతుకు వెళ్ళెను" (10 వచనం).

ఇక్కడ ఈ నాల్గు అక్షరాల్లో ఎంత అంతరార్థం దాగివుంది. "అతడు లేచి సారెపతుకు

వెళ్ళెను"! ఈ గ్రామానికి ఏలీయా వెళ్ళడానికి చాలా రోజులు పట్టియుండవచ్చు. అతడు ప్రయాణం చేస్తున్న భూభాగంలో అందరు అతన్ని గుర్తుపట్టేవారే ఉన్నారు. ఇతనికోసమే వాళ్ళు వలపన్నియున్నారు. అతనంటే అందరికి భయమే అతని పేరంటే చాలు అందరు అతణ్ణి ద్వేషించేవాళ్ళే. అతను కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళే మార్గంలో అతనికి త్రాగడానికి చుక్క నీరుకూడ లేదు; నెత్తి మీద భగభగమనే ఎండ; ఇక కాళ్ళు క్రింద నేల కాలే నిప్పులా పాదాలను కాల్చివేస్తుంది. ఇక నడుస్తుంటే లేచే దుమ్ముధూళి యింత అంతా కాదు. ఒక్క చెట్టు చేమ లేని ప్రదేశంగుండా అతను నడుచుకుంటు పోతున్నాడు. ఎక్కడ చూచినా ఎండిపోయిన ఎముకలు చచ్చిన జంతువుల కళేబరాలు ఎంతో భయానకంగా ఉంది మార్గం. బహుశ ఏలీయా వెళ్ళే దార్లో ఏదయినా యిల్లు ఉండివుంటే దాంట్లోని పిల్లలు ఆకలి దప్పిక చావుకేకల్తో అతని వెంట పడేవాళ్ళే. ఇదంతా కూడ సంక్షిప్తంగ చెప్పాలంటే ఒక్క నాల్గు మాటలతో "అతడు లేచి సారెపతుకు వెళ్ళెను" అని చెప్పవచ్చు.

ఇక ఎలాగో ఈ ఖఠోరమైన సుదీర్ఘ ప్రయాణం ముగిసి సారెపతులో వచ్చిపడ్డాడు ఏలీయా. అక్కడ చేరుకొన్నాడో లేదో అక్కడ అతను వూహించినదానికంటె భయంకరంగా ఉంది. *సారెపతులో కూడ దేవుడు నీరు లేకుండ చేశాడు* (గమనించు 14 వచనం)!

మొట్టమొదటిగా అతను చూచిందెవరినంటే తనగురించి శ్రద్ధ వహించడానికి దేవుడు ఏర్పాటు చేసిన విధవరాలిని. ఆమె ఏమిచేస్తుంది? తనకు తన కుమారునికి ఆఖరి భోజనం తయారుచేసుకోడానికంటూ ఏదో నాలుగు కట్టెపుల్లలు ఏరుకుందామని ఆమె వెతుకుతుంది. ఆ విధవరాలికి ఏమీలేదు; ఆకలితో అలమటిస్తూ ఉంది. మరి దేవుని త్రోవలు మన త్రోవలవంటివి కావు సుమా!

ఇక తర్వాత కథ మనుకు బాగా తెలుసు. ఏలీయా దప్పిక తీర్చుకోడానికి పాత్రలో కొంచెం నీరు తెమ్మన్నాడు. సరే నీళ్ళు తెద్దామని అటు తిరిగిందో లేదో ఒక రొట్టె కూడ తెమ్మని ఆమెనడిగాడు. ఆమె తనకున్న కొరతల గురించి ఏకరువు పెడుతుంటే అతను, "భూమిమీద యెహోవా వర్షము కురిపించువరకు ఆ తొట్టిలో ఉన్న పిండి తక్కువ కాదు, బుడ్డిలో నూనె అయిపోదని ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవా సెలవిచ్చియున్నాడనెను" (14 వచనం). యీ విధంగానే సమస్తం జరిగింది.

దేవుడు సారెపతులో నీరు ఎండిపోచేశాడెందుకు?

ఎందుకనగా యిక్కడ కొన్ని కారణాలున్నాయని చెప్పడంలో ఏ సందేహం లేదు: (1) ఇశ్రాయేలులో ఉన్న కష్ట నష్టాల ఉత్తరం నుండి ప్రారంభమవుతున్నాయి. కాబట్టి ఈ కష్టాల్లో వారికి కూడ ఆ ఫలితాల్లో పాలుపొంపులు కలిగియుండవలసియున్నది, (2) అతను పూర్తిగా దేవుని మీద ఆధారపడియున్నాడన్న సంగతి ఏలీయాకు తెలియజేయడానికి. స్పష్టం చేయడానికి, మరియు (3) యెహోవాయే నిజమైన దేవుడు అని బీద విధవరాలుకు స్పష్టం చేయడానికి.

## ముగింపు

మనం మన జీవితంలో ఏలాంటి పరిస్థితులు ఎదురైనా ఏమి సంభవించినా సరే, దేవుడు మనలను చేయివిడువలేదనియు, మనలను త్రోసి వేయలేదనియు, మనలను ప్రేమించుచు మన విషయం శ్రద్ధవహించుచున్నాడనియు, ఆయన మనలను కాపాడి సంరక్షించుచున్నాడనియు,

మన అక్కరలన్ని తీర్చుచున్నాడన్న ప్రగాఢ సత్యాన్ని వాస్తవాన్ని మనం ఎరిగియుండాలి.

కొన్ని సార్లు మనం యెషయా 49:14లో చెప్పబడినట్లు: "యెహోవా నన్ను విడచిపెట్టియున్నాడు, ప్రభువు నన్ను మరచియున్నాడు" అనే వారిలా ప్రవర్తిస్తాం. బాధపడి ఉండవచ్చు అలాంటప్పుడూ తరువాతి రెండు వచనాలు మనం చదువవలెను:

> "స్త్రీ తన గర్భమున పుట్టిన బిడ్డను కరుణింపకుండ తన చంటి పిల్లను మరచునా? వారైనా మరచుదురు గాని నేను నిన్ను మరువను. చూడుము నా యరచేతులమీదనే నిన్ను చెక్కియున్నాను నీ ప్రాకారములు నిత్యము నాయెదుటనున్నవి" (15, 16 వచనాలు).

"నా యరచేతుల గురించి నాకు బాగా తెలుసు నాకంటె బాగా తెలిసినవారెవరు," అన్న ఆలోచన మనకు కలుగుతుంది. "నా యరచేతులు గురించి నా కెంత తెలిసియున్నదో నేను నిన్ను అంత స్పష్టంగా ఎరిగియున్నాను. నీవు నా మనస్సులోనే యున్నావు నేను నిన్నెన్నడు మరచిపోను" అని దేవుడు అంటున్నాడు.

ఇక్కడ ఏలీయా అనుభవం ద్వారా కొన్ని పాఠాలను మనం నేర్చుకోగల్గుచున్నాం:

(1) మీకు అది అర్థవంతంగా ఉండినా ఉండకపోయినా దేవునికి మాత్రం విధేయులై యుండండి.

(2) అది ఏంటో అని మీ పరిజ్ఞానానికి గోచరం కాకపోయినా దేవునియందు పూర్తిగా నమ్మికయుంచండి.

(3) అన్ని విషయాల్లో నీకు కలిగియున్న దానిని బట్టి దేవునికి వందనాలు చెల్లించుము. నీవు కోరుకున్నది నీకు లేకపోయినాసరే. దేవుడు నీ అక్కరలను తీరుస్తాడు. దేవునికి నీ అవసరాలు తెలుసు, దేవుని ప్రేమించు వారికి "సమస్తమును సమకూర్చి మేలు కలుగునట్లు" చేస్తాడు దేవుడు (రోమీయులకు 8:28).

---

సూచనలు

[1]ఈ హీబ్రూ పదానికి "కాకోలములు" లేక "అరేబియనేలు" లేక "వ్యాపారస్తులు" అనే మానవ ప్రతినిధులను చూచించు పదములను భాషాంతరము చేయుటలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. నాకు తెలిసినంతవరకు అన్ని తర్జుమాలలో "కాకోలములు" అని ఉంది. ఏలీయా కథలోని ఈ అద్భుతమును అంగీకరించేవారికి ఈ హిబ్రూ పదమును "కాకోలములు" అని తర్జుమా చేయుటలో ఏ సమస్యలేదు. [2]స్థానికంగా ఆహారమును సరఫరా చేసేవారిని ఉదహరించు. [3]ఈ వాక్య భాగం "యొర్దానునకు ఎదురుగా" అని ఉంది. పాత నిబంధనలో సామాన్యంగా ఈ ప్రయోగం "యొర్దానునకు తూర్పున" అనే అర్థంతో వాడబడింది. పండితులైనవారు ఈ స్థలము పై ఏకీభవించలేదు. "మృత సముద్రమునకు ఉత్తర దిక్కున కొన్ని మైళ్ళ దూరంలో ఉందని" ఒక రచయిత అన్నాడు మరియు అది "యొర్దానులో పడమటికి ప్రవహించింది."

## దృశ్య సాధనాల-నోట్స్

**"దేవుని త్రోవలు మన త్రోవలవంటివి కావు"** అనే మాటలు పెద్ద అక్షరాలతో ఒక పెద్ద కార్డు లేక చార్టు మీద వ్రాయండి. ఈ పాఠ్యభాగమంతటిలో ఈ మాట ప్రాముఖ్యంగా వాడింది కాబట్టి అందరూ చదవగల్గునట్లుగా ఈ చార్టును ఎత్తి చూపించండి. అప్పుడప్పుడు ఆ చార్టును అలాగే పైకెత్తి చూపినప్పుడెల్లా అందరు పెద్దగా చదవాలని చెప్పండి. ఈ పాఠాన్ని నీవు చెబుతున్నప్పుడు ఆ మాట సందర్భం వచ్చినప్పుడెల్లా ఆ చార్టును ఎత్తి పట్టి అందరూ చూడగల్గునట్లు చేయుము. (గమనించండి: ఆ చార్టు వెనుక అదే భావం, అర్థం వచ్చే దేవుని దృష్టికి అనుకూలమైన మాటలు వ్రాయుము, ఎలాగంటే: **"ప్రభువు సెలవిచ్చియున్నాడు, 'నా త్రోవలు మీ త్రోవలవంటివి కావు.' "**)

## పాఠం యొక్క సంక్షిప్త వర్ణన

**I. ఇశ్రాయేలులో దేవుడు ఎందుకు నీళ్లను ఆపివేశాడు (17:1)?**

A. ఇశ్రాయేలులో ఏమి జరిగిందో రివ్యూ చేద్దాం.

1. ద్వితియోపదేశకాండము 7:1-6 అన్య దేశాలవారితో వివాహం చేసికో వద్దని గమనించు. ఈ హెచ్చరిక గౌరవించబడలేదు. అహాబు ప్రక్క యెజెబెలు ఉంది.
2. ఈ భయముకొరకు దేవుడు ఏమి చేశాడు? ఆయన అహాబునొద్దకు ఏలీయాను పంపాడు: 1 రాజులు 17:1. మూడున్నర సంవత్సరాలు వర్షింపలేదు (లూకా 4:25; యాకోబు 5:17). "సంవత్సరములు" అనే పదాన్ని గుర్తుంచుకో.

B. దేవుడు ఇశ్రాయేలు నీటిని ఎందుకు ఆపు చేశాడు?

1. దేవుని హెచ్చరిక (ద్వితియోపదేశకాండము 7) వెంటాడబడింది (ద్వితియోపదేశకాండము 11:16, 17). వర్షింపవద్దని ఏలీయా ప్రార్థించాడు (యాకోబు 5:17). ద్వితియోపదేశకాండము 11లో ఏమి జరుగుతుందని భయపెట్టాడో దాని నిమిత్తం అతడు ప్రార్థించియుంటాడు.
2. "ఎందుకు?" అనే ప్రశ్నకు దేవుడు జవాబు యియ్యవచ్చు:
   a. "ఎందుకంటె జనులు నా మాటకు అవిధేయులయ్యారు వారు శిక్షకు అర్హులు."
   b. "నా నమ్మకమైన దాసుడు మనఃపూర్వకముగా ప్రార్థించాడు."
   c. "నేను దేవుడననియు; వారు మారుమనస్సు పొంది నావైపు తిరుగునట్లు వారి దోష భరితమైన మార్గాలు చూపడానికి."

**II. కెరీతు వద్ద దేవుడు నీళ్లను ఎందుకు లేకుండ చేశాడు (17:2-7)?**

A. అహాబును హెచ్చరించిన మీదట, దేవుడు తన సంకల్పంలోని రెండవ మెట్టు నిచ్చాడు.

1. ఒక్కొక్క అడుగు ఎలా వేయాలో ఏలీయా చెప్పబడ్డాడు.
2. రెండవ మెట్టు కనిపెట్టబడింది కాదు: "కెరీతు వాగువద్ద దాగియుండుము" (3, 4 వచనాలు).
3. దేవుడు చెప్పినదానిని ఏలీయా చేశాడు (5, 6 వచనాలు).
    a. "కెరీతు" అంటే "వేరు చేయబడుట" లేక "తుంచివేయబడుట." ఒక సంవత్సరం వరకు, ఏలీయా వాగునొద్ద నివసించినందున యితరులనుండి వేరుచేయబడ్డాడు.
    b. పనిలేని ఈ కాలము ఏలీయా మీద భారంగా ఉండియుండవచ్చు.

B. అప్పుడు దేవుడు కెరీతు వద్ద నీటిని ఎండిపోజేశాడు!
1. ఎక్కడ ఉండమని దేవుడు కోరాడో ఏలీయా అక్కడ ఉన్నాడు కాని నీళ్లు తీసివేయబడ్డాయి! (7 వ.).
2. కెరీతునొద్ద దేవుడు నీటిని *ఎందుకు* ఆరిపోజేశాడు?
    a. ఎందుకంటె ఏలీయా ప్రార్థించాడు (7వ వచనం; యాకోబు 5:17). కొన్నిసార్లు మనం ఎదురుచూడని విధానంలో మన ప్రార్థనలకు బదులు యివ్వబడుతుంది.
    b. ఎందుకంటే యిది తరువాత అంచెకు సమయం. మన జీవితాలకు దేవునిని ఆయన సంకల్పాన్ని మనం విశ్వసించ నేర్చుకొనవలసి యుంటుంది.

**III. సారెపతు వద్ద దేవుడు నీటిని ఎందుకు ఆపివేశాడు (17:8-16)?**

A. సారెపతుకు వెళ్లవలసిందిగా దేవుడు ఏలీయాకు తెలిపాడు (8, 9 వచనాలు).
1. ఇశ్రాయేలుకు నేరుగా ఉత్తరాన, ఫెనీకేలోని సముద్ర తీరముననున్న ఒక చిన్న పట్టణము సారెపతు. ఇది ఏలీయా ఉన్న చోటునుండి 75నుండి 100 మైళ్లు ఉత్తర దిశగా ఉంటుంది. ఏలీయా యింకను తెలియబడనివాడుగా ఉండిపోయాడు. అతడు విధవరాలి యింట ఉంచబడ్డాడు.
2. ఏలీయా *ఎలా* స్పందించాడు? "అతడు లేచి వెళ్లాడు."

B. ఏలీయా అక్కడికి వెళ్లినప్పుడు, నీళ్లు అక్కడ కూడ నిలిపివేయబడ్డాయి!
1. ఏ విధవరాలి వద్ద ఏలీయా బస చేయాలో ఆ విధవరాలు ఆకలి బాధతో చావనైయుంది!
2. సారెపతులో దేవుడు నీళ్లను ఎందుకు నిలిపివేశాడు?
    a. ఇశ్రాయేలులోని సమస్య ఉత్తరంనుండి వచ్చింది, గనుక వారు కూడ ఈ పర్యవసానాలలో పాలుపొందాలి.
    b. తాను సంపూర్ణంగా దేవుని మీద ఆధారపడవలసిందని ఏలియాకు నొక్కి చెప్పబడుతుంది.
    c. యెహోవా నిజమైన దేవుడని పేద విధవరాలిని ఒప్పించడానికి.

**ముగింపు**

A. జీవితంలో మనకు ఏమి సంభవించినా, దేవుడు మనలను విడిచిపెట్టలేదు

కాని ఆయన యింకను ప్రేమిస్తున్నాడని మన అవసరతలకు ఆయన ఏర్పాటు చేస్తున్నాడని మనం గ్రహించడం ఎంత అవసరమో (యెషయా 49:14–16)!

B. 1 రాజులు 17:1–15లోని గొప్ప పాఠాలలో కొన్ని యిక్కడ యివ్వబడ్డాయి:
   1. మనకు అర్థం కానప్పుడు సహితం మనం దేవునికి లోబడాలి.
   2. మనకు గ్రహింపు కాకపోయినా, దేవునియందు నమ్మికయుంచాలి.
   3. నీకు కలిగియున్న దేనికైనా దేవుని స్తుతించు – నీవు కావాలని కోరుకున్నవి నీకు లేకపోయినప్పుడు సహితము ఆయనను స్తుతించు.